క్లుప్తంగా

ఘనంగా ఆటో డే

విజయనగరం టౌన్: లక్షలాది మంది ఆటోలు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారని ఏఐ ఎఫ్‌టీయూ అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డి నారాయణరావు, అప్పలరాజురెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం ఆటో డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆటో కార్మికులపై వేస్తున్న చలానాలను రద్దు చేయాలని కోరారు. సీహెచ్.ధర్మ, జి.నారాయణరావు,ఆటో కార్మికులు పాల్గొన్నారు.

సహాయం చేసే చేతులు మిన్న..



నిరుపేదలకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ఈశ్వర్‌కౌశిక్, తదితరులు

విజయనగరం: నలుగురికీ సహాయపడేవారు చిరస్థాయిగా నిలిచిపోతారని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుడు జి.ఈశ్వర్‌కౌశిక్ అన్నారు. ఆదివారం స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులో అమ్మ సేవాసొసైటీ ఆధ్వర్యంలో 60 మంది నిరుపేదలకు నిత్యావసర సరుకులను ఆయన చేతుల మీదగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేదలను ఆదుకునేందుకు అమ్మా సేవా సొసైటీ ఇటువంటి వితరణ కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సేవా సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజలందరిపై సాయినాథుడి ఆశీస్సులు



మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

విజయనగరం: మానవసేవే మాధవసేవ అని చాటి చెప్పిన షిర్డీ సాయినాథుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి ఆకాంక్షించారు. స్థానిక అలకానంద కాలనీలోని సాయినాథుని ఆలయంలో ఆదివారం మహా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు.

చురుగ్గా రహదారి మరమ్మతులు



మరమ్మతులు చేస్తున్న కార్మికులు

నెల్లిమర్ల రూరల్: నగర పంచాయతీ పరిధిలోని గాంధీనగర్ కాలనీలో సీసీ రహదారి మరమ్మతులు చురుగ్గా సాగుతున్నాయి. విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ జానా ప్రసాద్ తన సొంత నిధులతో 13,14 వార్డుల్లో పలు చోట్ల పాడైన సీసీ రహదారికి ఆదివారం మరమ్మతులు చేయించారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన సీసీ రహదారులు అధ్వానంగా ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని.. ఈ విషయాన్ని గాంధీనగర్ వాసులు ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లగా.. మరమ్మతులు చేయిస్తున్నారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ, కాలనీలో కొత్తగా సీసీ రహదారులు, డ్రైన్లను త్వరలోనే నిర్మించి పూర్తి స్థాయిలో సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలి

విజయనగరం ఫూల్‌బాగ్: అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు, ఉత్తరాంధ్ర జిల్లాల గౌరవాధ్యక్షుడు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.కామేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక అమర్ భవన్‌లో అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సూరప్పుడు ఆధ్వర్యంలో అన్ని రాజకీయ పార్టీల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆగస్టు 15వ తేదీలోగా బాధ్యులకు పూర్తి న్యాయం చేయాలని.. లేకుంటే 30వ తేదీన విజయవాడలో భారీ ఆందోళన చేపట్టనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈవీ నాయుడు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవీపీ రాజు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్. రమేష్, సీపీఎం నాయకుడు ఎ.జగన్మోహన్, జనసేన పార్టీ నాయకుడు ఆదాడ మోహన్, లోక్‌సత్తా పార్టీ నాయకులు రమేష్, టి.రాజారావు, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు కోటేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎస్. రంగరాజు పాల్గొన్నారు.

అక్రమ వాటర్ ప్లాంట్‌లను సీజ్ చేయాలి

విజయనగరం ఫూల్‌బాగ్: నిబంధనలకు విరుద్ధంగా నెలకొల్పిన వాటర్ ప్లాంట్‌లను సీజ్ చేయాలని కోరుతూ ఈ నెల 10న కలెక్టరేట్ వద్ద ధర్నా చేయనున్నట్లు పట్టణ పౌర సంక్షేమ సంఘ అధ్యక్షుడు కంది త్రినాథ్ తెలిపారు. ఈ మేరకు ధర్నా విజయవతం చేయాలని కోరు తూ అయ్యన్నపేట, వేణుగోపాలపురం, తోటపాలెం, గంజిపేటలో ఆదివారం ప్రచారం నిర్వహించారు.

అందుబాటులో పట్టణ ఆరోగ్య కేంద్రాలు

- ప్రజలకు మెరుగైన వైద్య సేవలు
- విజయనగరం నియోజకవర్గంలో 12 పట్టణ పీహెచ్‌సీలు
- గ్రామీణ ప్రాంత ప్రజలకు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా సేవలు



విజయనగరంలోని రాజీవ్‌నగర్ కాలనీలో ఉన్న వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

విజయనగరం ఫోర్ట్:

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక పట్టణ ప్రజలతో పాటు గ్రామీణ ప్రాంత ప్రజలకు కూడా వైద్యసేవలు చేరువయ్యాయి. గతంలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ప్రజలకు దూరంగా ఉండేవి. దీంతో వారికి వైద్య సేవలు సక్రమంగా అందేవి కావు. కాని ప్రస్తుత ప్రభుత్వం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సంఖ్యను పెంచింది. ఐదు నిమిషాల నుంచి పది నిమిషాల్లో ఆస్పత్రికి చేరుకునే విధంగా పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సంఖ్యను ప్రభుత్వం పెంచింది. గతంలో విజయనగరంలో నాలుగు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉండేవి. ఇప్పుడు వాటి సంఖ్యను 12కు పెంచారు. దీంతో ప్రజలు చిన్నచిన్న ఆరోగ్య సమస్యలున్నా కేంద్రాలకు వెళ్లి వైద్యసేవలు పొందుతున్నారు. విజయనగరం పట్టణంలో ఫూల్‌బాగ్, వీటీ అగ్రహారం, రాజీవ్ నగర్ , లంకాపట్నం, ఇస్మాయిల్ కాలనీ, ఉల్లివీధి, అరుంధతీనగర్, జొన్నగుడ్డి, కేఎల్ పురం, సాయినాథకాలనీ, సంతపేట, వినాయకనగర్‌లో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి.

సకాలంలో అందనున్న వైద్య సేవలు..

పట్టణ పీహెచ్‌సీలు ప్రజలకు దగ్గరగా ఏర్పాటు చేయడం వల్ల సకాలంలో వైద్య సేవలు అందుతున్నాయి. సకాలంలో ఆస్పత్రికి చేరడం వల్ల రోగిని ప్రాణాపాయ స్థితి నుంచి రక్షించవచ్చు. అంతేకాకుండా సీజనల్‌గా వచ్చే జ్వరం, దగ్గు, జలుబు వంటి వ్యాధులకు జిల్లా ఆస్పత్రి, ఏరియా ఆస్పత్రి, సీహెచ్‌సీ, ప్రైవేట ఆస్పత్రులకు వెళ్లనవసరం ఉండదు. పట్టణ ప్రజలు అందుబాటులో ఉండే పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి వైద్యం చేయించుకోవచ్చు. గర్భిణులు, పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు కూడా కేంద్రాల్లో వేస్తున్నారు. హెచ్‌బీ, బీపీ, సుగర్, మలేరియా వంటి వ్యాధి నిర్ధారణ పరీక్షలు కూడా జరుగుతున్నాయి.

25 వేల జనాభాకు ఒక ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం..

గతంలో 60 వేల నుంచి 70 వేల జనాభాకు ఒక పట్టణ ప్రాథమిక ఆరోగ్యం ఉండేది. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పట్టణ ప్రజలకు మరింత చేరువగా వైద్య సేవలు అందించడానికి 25 వేల జనాభాకే ఒక పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేసింది.

ఆదుకుంటున్న ఫ్యామిలీ డాక్టర్ ..

గ్రామీణ ప్రాంత ప్రజలకు ఇంటివద్దే మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహిస్తోంది. విజయనగరం మండలంలో 12 సచివాలయాలు ఉన్నాయి. ప్రతి సచివాలయం పరిధిలో నెలలో రెండు పర్యాయాలు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా వైద్య సేవలు అందిస్తున్నారు. ఉదయం 9 గంటల కల్లా సచివాలయం వద్దకు చేరుకుని అక్కడ వైద్య శిబిరం ఏర్పాటు చేస్తారు. మధ్యాహ్నం ఒంటిగంట వరకు శిబిరం వద్దకు వచ్చే వారికి వైద్య తనిఖీలు నిర్వహిస్తారు. అదేవిధంగా బీపీ, సుగర్, ఈసీజీ పరీక్షలు చేస్తారు. మధ్యాహ్నం రెండు 2 గంటల తర్వాత పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి విద్యార్థులకు తనిఖీలు నిర్వహిస్తారు. ఆ తర్వాత మంచంపై లేవలేని వారి ఇళ్లకు వెళ్లి చికిత్స అందిస్తారు. విజయనగరం మండలంలో అక్టోబర్ 2022న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ప్రారంభమైంది. అప్పటినుంచి మే నెలఖారు నాటికి 11,311 మందికి వైద్య సేవలు అందించారు. ఇందులో జనరల్ ఓపీ 6,475, రక్తహీనత ఉన్న వారికి 98 మందికి, గర్భిణులు 504 మందికి, బాలింతలు 289 మందికి, క్షయ రోగులు 19 మందికి, బీపీ రోగులకు 1,883 మందికి, సుగర్ పరీక్షలు 1137 మందికి, బీపీ, సుగర్ రెండు వ్యాధులున్న వారికి 890 మందికి వైద్య సేవలు అందించారు.



వృద్ధురాలిని పరీక్షిస్తున్న వైద్యురాలు



సారికలో మంచంపై ఉన్న రోగి ఇంటికి వెళ్లి వైద్యం అందిస్తున్న వైద్యుడు

ఇంటికి వచ్చి వైద్యం చేస్తున్నారు...



నాకు రెండేళ్ల కిందట పక్షవాతం వచ్చింది. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ప్రారంభం కాకముందు ఆటోలో విజయనగరం వెళ్లి వైద్యం చేయించుకునేవాడిని. నెలకు సుమారు 1500 రూపాయల వరకు ఖర్చయ్యేది. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ప్రారంభమయ్యాక ఇంటికి వచ్చి వైద్య సేవలు అందిస్తున్నారు.

– మంచాల పరశురామ్, సారిక గ్రామం

రెండుసార్లు వస్తున్నారు..



నేను కొన్నేళ్లుగా బీపీతో బాధపడుతున్నాను. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం రాకముందు విజయనగరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లి మందులు తెచ్చుకొనేదాన్ని. ఇప్పుడు మా గ్రామానికి నెలలో రెండుసార్లు వచ్చి పరీక్షించి మందులు అందిస్తున్నారు. ఇంటివద్దే తనిఖీలు చేపట్టి మందులు అందివ్వడంతో పట్టణానికి వెళ్లే శ్రమ తగ్గింది.

– మామిడి సత్యవతి, సారిక గ్రామం

ఘనంగా మంత్రి బొత్స జన్మదిన వేడుకలు

- తూర్పుకాపు యువత ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు

విజయనగరం: జిల్లా తూర్పు కాపు యువత ఆధ్వర్యంలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పుట్టినరోజు వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. నగరంలోని ఫూల్‌బాగ్ కాలనీలో గల ద్వారకామయి అంధుల పాఠశాల ఆవరణలో మంత్రి కుమారుడు డాక్టర్ బొత్స సందీప్, మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి మండలి డైరెక్టర్ సంగంరెడ్డి బంగారు నాయుడు కట్ చేశారు. అనంతరం విద్యార్థులకు దుప్పట్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ, మంత్రి బొత్స సత్యనారాయణ జన్మదినాన్ని పురస్కరించుకుని నగరంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. జిల్లా కాపు యువత తరఫున పలు ప్రజాహిత కార్యక్రమాలు కూడా చేపడుతున్నామని తెలిపారు. అన్ని వర్గాల వారిని కలుపుకొని వెళ్లే మనస్తత్వం గల మంచి మనిషి మంత్రి బొత్స సత్యనారాయణ అని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా తూర్పుకాపు సామాజిక వేదిక అధ్యక్షుడు రొంగళి రామారావు, అంబళ్ల అప్పలనాయుడు, ఏఎంసీ చైర్‌పర్సన్ నడిపేనా శశి భార్గవి, తూర్పు కాపు సామాజికవర్గ నాయకులు నడిపేన శ్రీనివాసరావు, మామిడి అప్పలనాయుడు, కెల్లా శ్రీనివాసరావు, రెడ్డి గురుమూర్తి, భోగాపురం రవిచంద్ర, తాడ్డి సురేష్, కరుమజ్జి సాయికుమార్, నాయుడుపాల్గొన్నారు.

ప్రజలు మెచ్చిన నాయకుడు మంత్రి బొత్స

విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ ప్రజలు మెచ్చిన నాయకుడని వైఎస్సార్‌సీపీ నాయకులు అవనాపు విజయ్, పిళ్లా విజయ్‌కుమార్ అన్నారు. మంత్రి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి తనయుడు డాక్టర్ బొత్స సందీప్ పైడితల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం స్థానిక గురజాడ అప్పారావు జంక్షన్‌లో 2000 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గాడు అప్పారావు, చందక రమణ, ప్రసాద్‌ప్రభు, యాత కార్పొరేషన్ డైరెక్టర్ అప్పలరాజు, రౌతు చంటి, బొడ్డు రమణ, తదితరులు పాల్గొన్నారు.



పైడితల్లి ఆలయం వద్ద చీరలు పంపిణీ చేస్తున్న సందీప్, తదితరులు



అంధుల పాఠశాలలో విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ బొత్స సందీప్, తదితరులు



సీతం కళాశాల వద్ద దివ్యాంగులకు కృత్రిమ అవయవాల పంపిణీ

సత్య విద్యా సంస్థల ఆధ్వర్యంలో..

విజయనగరం అర్బన్: మంత్రి బొత్స సత్యనారాయణ జన్మదిన వేడుకలు ధీర ఫౌండేషన్, సీతం ఇంజినీరింగ్ కళాశాల, సత్య డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నగరంలోని కనకమహాలక్ష్మి దేవాలయం, ప్రేమ సమాజం వృద్ధాశ్రమం, పైడితల్లి అమ్మవారు దేవాలయం, సీతం కళాశాల వద్ద వికలాంగులకు చక్రాల కుర్చీలు, కృత్రిమ అవయవాలు, వినికిడి పరికరాలు, చీరలు, బెడ్ షీట్లు, పండ్లు, రొట్టెలు, భోజనం, పండ్ల రసాలు, వాటర్ బాటిళ్లు, దుప్పట్లు, పంపిణీ చేశారు. కార్యక్రమాలలో సత్య విద్యాసంస్థల సంచాలకుడు డాక్టర్ మజ్జి శశిభూషణరావు, ఎన్‌సీసీ ఆఫీసర్ కెప్టెన్ సత్యవేణి, సీఎస్‌ఓ సత్యనారాయణ, ఫిజికల్ డైరెక్టర్ మహేశ్వరరావు, మేనేజర్ లంక రాము, సిబ్బంది, ఎన్‌సీసీ క్యాడెట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

శుభాకాంక్షల వెల్లువ..

మంత్రి బొత్స సత్యనారాయణ పుట్టిన రోజు వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. జిల్లా కేంద్రంలోని ఆయన స్వగృహంలో జరిగిన వేడుకల్లో మంత్రి బొత్స కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సూర్యనారాయణరాజు (సురేష్‌బాబు), తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు.



కేక్ కట్ చేస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ



మంత్రి బొత్స సత్యన్నారాయణకు శ్రీవారి ప్రతిమను బహూకరిస్తున్న ఎమ్మెల్సీ పెనుమత్స



మంత్రి బొత్స సత్యనారాయణకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



మంత్రి బొత్సకు అభినందనలు తెలుపుతున్న శిష్టకరణ సంఘ అధ్యక్షుడు ఎంపీ గౌరీశ్వరరావు



మంత్రి బొత్సకు అభినందనలు తెలియజేస్తున్న పార్టీ నాయకులు కర్రి వేణుమాధవ్, జనాప్రసాద్, తదితరులు

అభివృద్ధే అభిమతం..



అభివృద్ధి పనుల శిలాఫలకం ఆవిష్కరిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, తదితరులు

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- ఒకటో డివిజన్‌లో రూ.60.40 లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం

విజయనగరం: కార్పొరేషన్ హోదా దక్కించుకున్న విజయనగరం పట్టణాన్ని రాష్ట్రంలో ఆదర్శ నగరంగా తీర్చిదిద్దడంలో భాగంగా అభివృద్ధే అభిమతంగా శంకుస్థాపన మాసోత్సవాలు నిర్వహిస్తున్నామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. శంకుస్థాపన మాస మహోత్సవంలో భాగంగా ఆదివారం వివిధ అభివృద్ధి పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి శంకుస్థాపనలు చేశారు. ఒకటో డివిజన్ పరిధిలో గల ఫూల్‌బాగ్ లక్ష్మీగణపతి కాలనీ, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ప్రాంతంలో రూ. 37.20 లక్షలతో నిర్మించనున్న రహదారులు, కాలువ నిర్మాణ పనులను కొబ్బరికాయలు కొట్టి ప్రారంభించారు. అలాగే అదే డివిజన్‌లోని వేణుగోపాలపురంలో రూ.23.20 లక్షలతో 40 కేఎల్ సామర్థ్యం గల వాటర్ ట్యాంక్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ, నగర ప్రజలకు కనీస మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించామన్నారు. ఇందులో భాగంగా గతంలో శత, ద్విశత శంకుస్థాపన కార్యక్రమాలు చేపట్టి అనేక అభివృద్ధి పనులు పూర్తి చేశామని చెప్పారు. కార్యక్రమంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ ముచ్చు లయాయాదవ్, వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్‌లు ముద్దాడ మధు, ముచ్చు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం



కబ్జాకు గురువుతున్న ప్రభుత్వ బంద, బంజరు భూమి

భోగాపురం: మండలంలోని గూడెపువలస రెవెన్యూ పరిధిలో దల్లిపేట నుంచి ముగడపేట వెళ్లే రహదారిలో సుమారు ఎకరా 70 సెంట్ల (బంద, బంజరు భూమి) ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు ఓ వ్యక్తి ప్రయత్నిస్తున్నాడు. గూడెపువలస గ్రామానికి చెందిన చెందిన ఒక వ్యక్తి ప్రభుత్వానికి చెందిన బంద, బంజరు భూమిని మట్టితో కప్పి చదును చేసేందుకు యత్నించగా స్థానికులు అడ్డుకున్నారు. ఈ భూమి తనదేనని ఆక్రమణదారుడు చెబుతుండగా.. రెవెన్యూ రికార్డుల ప్రకారం అది ప్రభుత్వ భూమిగా ఉంది. సర్వే నంబర్ 153-1, 153-2లో ఆ భూమి వివరాలున్నట్లు రికార్డులు చెబుతున్నాయి. విషయం తెలిసినప్పటికీ రెవెన్యూ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. దీనిపై తహసీల్దార్ బంగార్రాజు వివరణ కోరగా.. విషయం తన దృష్టికి వచ్చిందని.. ఆక్రమణదారుడిపై చర్యలు తీసుకుంటామన్నారు.

గోవిందరావు సేవలు మరువలేనివి..



గోవిందరావు విగ్రహాన్ని అవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

భోగాపురం: వైఎస్సార్‌సీపీకి, భోగాపురం గ్రామాభివృద్ధికి పీఏసీఎస్ అధ్యక్షుడు, పార్టీ నాయకుడు సుందర గోవిందరావు చేసిన సేవలు మరువలేనివని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని నందిగాం శేరిక పొలం కొబ్బరితోటలో గోవిందరావు ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన కూమారులు సుందర హరీష్, రమేష్ ఏర్పాటు చేసిన గోవిందరావు విగ్రహాన్ని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఆదివారం అవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గోవిందరావు మృతి పార్టీకి తీరని లోటన్నారు. ఆయన కుటుంబానికి ఎల్లప్పుడు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం మెయ్యి మంది పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, నాయకులు బడ్డుకొండ మణిదీప్‌నాయుడు, ప్రదీప్‌నాయుడు, దంతులూరి రావాడబాబు, పడాల శ్రీనివాసరావు, గదల సన్యాసినాయుడు, చిక్కాల సాంబశివరావు, బైరెడ్డి ప్రభాకరరెడ్డి, మహంతి జనార్ధన్, ఎం.నరసింహులు, గరే మురళీమోహనరావు, కొల్లు రామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

రామచంద్ర యాదవ్ పర్యటనను విజయవంతం చేయండి

- రాష్ట్ర యాదవ హక్కుల పోరాట సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ ఇసరపు శేఖర్

విజయనగరం టౌన్: బీసీల నాయకుడు రామచంద్ర యాదవ్ పర్యటన విజయవంతం చేయాలని రాష్ట్ర యాదవ హక్కుల పోరాట సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ ఇసరపు శేఖర్ యాదవ్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ప్రదీప్‌నగర్‌లో ఉన్న యాదవ సంక్షేమ సంఘం కార్యాలయంలో పర్యటనకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో అధిక సంఖ్యాకులైన బీసీల రాజ్యాధికారం కోసం రామచంద్ర యాదవ్ అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారన్నారు. వెనుకబడిన కులాలు అభివృద్ధి చెందాలంటే రాజ్యాధికారాన్ని చేజిక్కించుకోవడం ఒక్కటే మార్గమన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 12న విజయనగరం వస్తున్న యువ పారిశ్రామికవేత్త రామచంద్ర యాదవ్ పర్యటనలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని బలహీన వర్గాల నేతలంతా ఏకతాటిపైకి రావాలని అప్పుడే బీసీల రాజ్యాధికారం లక్ష్యం నెరవేరుతుందన్నారు. కార్యక్రమంలో జాగరపు ఈశ్వరపు ప్రసాద్‌తో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన వెనుకబడిన కులాల నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఇసరపు శేఖర్‌యాదవ్, తదితరులు

పూడికతీత పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు

విజయనగరం: వర్షాకాలంలో నగరంలోని ప్రధాన కాలువల్లో పేరుకుపోయిన పూడికల వల్ల ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు కమిషనర్ ఆర్. శ్రీరాములనాయుడు తెలిపారు. ఈ మేరకు గంటస్తంభం నుంచి బుద్ధ విగ్రహం వరకు ఉన్న ప్రధాన కాలువ పూడికతీత పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు. జేసీబీ సహాయంతో రాత్రంతా పూడికతీత పనులు చేపట్టగా... ఆదివారం ఉదయం కమిషనర్ ఆ పనులను పరిశీలించారు. ప్రతి ఏడాది వర్షాలు కురిసే సమయంలో ప్రధాన కాలువలలో పూడిక పేరుకుపోవడంతో వర్షపు నీరు బహిరంగ ప్రదేశాలలో, రోడ్లపైకి ప్రవహిస్తోందని కమిషనర్ తెలపారు. దీంతో పూడికతీత పనులు యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నట్లు చెప్పారు. కాలువల్లో వ్యర్థాలు వేయకుండా ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, కాంట్రాక్టర్ మత్స సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.